క్లుప్తంగా

కబేళాలకు తరలిస్తున్న గోవుల పట్టివేత

వర్ధన్నపేట : జఫర్‌ఘడ్ నుంచి వర్ధన్నపేట మీదుగా రెండు టాటా ఏస్ వాహనాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కబేళాలకు తరలిస్తున్న ఆవులు, ఎడ్లను భజరంగ్‌దళ్, ఏబీవీపీ, బీజేపీ యువ మోర్చా, విశ్వహిందు పరిషత్ నాయకులు శనివారం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. చట్టాలున్నా గోవుల అక్రమ రవాణా ఆగడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, నాయకులు బోయినపల్లి దేవేందర్, వీహెచ్‌పీ జిల్లా బాధ్యుడు రాజు, గోరక్ష ప్రముఖ్ నాగరాజు, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్తీక్, నాయకులు శ్రీశాంత్, సాయికిరణ్, శ్రవణ్‌కుమార్, పెండోట మహంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన రేవంత్‌రెడ్డి ప్రజాదర్బార్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్రఫ్, నాయకులు జలగం రవి, ఖలీల్, కస్రబోయిన కుమార్, చందు పర్వతాలు, ఐలయ్య, చెడుపాక శ్రీకాంత్, గారె అనిల్, గారె వెంకన్న, గారె రమేశ్, గుగులోతు చంద్రు, గుగులోతు వెంకటేశ్ తదితరులు మాజీ మంత్రి దయాకర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో శనివారం చేరారు. ఈ సందర్భంగా వారికి దయాకర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహ నాయక్, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, నాయకులు లేతాకుల రంగారెడ్డి, ఐత రాంచందర్, గారె నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, సుధాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చొరవ'

వర్ధన్నపేట : వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే నాగరాజు చొరవ తీసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, బీసీ వర్గీకరణ గురించి అసెంబ్లీలో అనేక సార్లు ఎమ్మెల్యే నాగరాజు గళమెత్తారని చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియోజకవర్గ, జిల్లా అభివృద్ధిని విస్మరించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎమ్మెల్యే నాగరాజు చొరవతో మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు సైతం కృషి చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు తూల్ల రవి పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు సహకరించండి

సంగెం : మండలంలోని గవిచర్లలో గుండ బ్రహ్మయ్య జాతర నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని పర్వతగిరి సీఐ రాజగోపాల్ కోరారు. గవిచర్లలో శనివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరను పార్టీలకు అతీతంగా శాంతియుతరంగా నిర్వహించుకోవాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎస్సై నరేశ్, పంచాయతీ కార్యదర్శి శరత్, ఆలయ చైర్మన్ కొంతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును వినియోగించుకోవాలి

పర్వతగిరి : పురాతన సన్నూరు వెంకటేశ్వర స్వామి ఆలయం ఉన్న సన్నూరు గ్రామం మీదుగా నడిపిస్తున్న ఆర్టీసీ బస్సును ప్రజలు వినియోగించుకోవాలని నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నర్సంపేట డిపో నుంచి బస్సు సోమారం, కొండాపురం, ఊకల్, గట్టికల్, సన్నూర్ గ్రామాల మీదుగా తొర్రూరుకు ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగిస్తుందని ఆమె పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు తొర్రూరు నుంచి రెండో ట్రిప్పు బయల్దేరి అదే దారిలో నర్సంపేటకు బస్సు చేరుకుంటుందని వివరించారు.

'యువ వికాసం'ను వినియోగించుకోండి

పర్వతగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత, ఆసక్తి కలిగిన యువత ఏప్రిల్ 5 నాటికి మీసేవ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పథకం అనేక రకాల ఉపాధి పొందవచ్చని చెప్పారు. సబ్సిడీ ఉంటుందని తెలిపారు. ఐనవోలు ఆలయ కమిటీ డైరెక్టర్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

'యువ వికాసానికి' సర్వర్ గండం..!



- వారం రోజులుగా సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు
- 'తహసీల్' చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు
- మేమేం చేయలేమంటున్న అధికారులు
- గడువు పెంచాలని పలువురి డిమాండ్



కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయం

కమలాపూర్ : రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతి, యువకులకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టి బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి చేయడంతో సబ్సిడీ రుణాల కోసం మండలంలోని పలువురు నిరుద్యోగులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాల్లో ఇప్పటికే దరఖాస్తు చేసుకోగా మరికొందరు దరఖాస్తు చేసుకుంటున్నారు. సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువు సమీపిస్తున్న తరుణంలో వారం రోజులుగా మీ సేవ పోర్టల్ సర్వర్ డౌన్ కావడంతో దరఖాస్తుదారులకు సకాలంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందడం లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మీ సేవ కేంద్రాలతో పాటు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ నిత్య ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వర్ ప్రాబ్లంతో సకాలంలో సర్టిఫికెట్లు అందడం లేదని, రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పెంచాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

సర్వర్ డౌన్.. మేమేం చేయలేం..

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగుల ధ్రువీకరణ పత్రాలు ఎంతకూ ఆన్‌లైన్ కాకపోవడంతో మీ సేవ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అక్కడ మీ సేవ కేంద్రాల నిర్వాహకులను అడిగితే తాము ఆన్‌లైన్ చేసి తహసీల్ కార్యాలయంలో అప్లికేషన్లు అందజేశామని చెబుతుండగా, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అడిగితే సర్వర్ ప్రాబ్లం ఉందని, సర్వర్ పని చేస్తేనే సర్టిఫికెట్లు వస్తాయని, అంతవరకు తాము ఏం చేయలేమని చేతులెత్తేస్తున్నారు.

రాత్రంతా కూర్చున్నా 2, 3 గంటలే..

ఉదయమంతా సర్వర్ డౌన్ అయి మీ సేవ పోర్టల్ పని చేయడం లేదని, ఎలాగైనా దరఖాస్తుదారులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్న ఉద్దేశ్యంతో సర్వర్ ఎప్పుడు పని చేస్తుందా అని సంబంధిత అధికారులు రాత్రంతా మెలకువతో ఉంటున్నప్పటికీ అర్ధరాత్రి తర్వాత కేవలం 2 నుంచి 3 గంటలు మాత్రమే సర్వర్ అరకొరగా పని చేస్తుందని అధికారులు తెలిపారు. ఆ కాస్త సమయంలో పెండింగ్‌లో ఉన్న అన్ని సర్టిఫికెట్లను ఆన్‌లైన్ చేయలేకపోతున్నామని అంటున్నారు. ఈ నెల 28న అర్ధరాత్రి కేవలం గంట పాటు మాత్రమే సర్వర్ పని చేసిందని తెలిపారు. కాగా సర్వర్ ప్రాబ్లంతో ఒక మండలానికి ఇంకో మండలానికి సంబంధించిన తహసీల్దార్ డిజిటల్ సంతకం చూపిస్తుండటం విడ్డూరం.

జారీ చేసినవి 1,230..

పెండింగ్‌లో ఉన్నవి 1,356

మండల వ్యాప్తంగా గత పది రోజుల నుంచి ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రాల కోసం 852 దరఖాస్తులు రాగా 415 ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం 1,734 దరఖాస్తులు రాగా 815 అధికారులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇంకా 1,356 కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

ఉగాది కవితలు

ఉగాది శోభ



పచ్చని చిగురుల పులకింతలో
పువ్వుల పరిమళ గీతంలో
కొత్త ఉత్సాహపు తీయని గానంలో
ఉగాది ఉషస్సై విరబూసింది!
నూతన ఆశల నినాదంగా
నవ సంస్కృతికి నాందిగా
నవ చైతన్యపు చిరునవ్వుగా
ఉగాదితో ఉజ్వల యుగం వికసిస్తుంది!!

\- జ్యోతి మువ్వల, హనుమకొండ

హర్ష వర్షం



కోటి శుభాల విశ్వాస కవచమై
విశ్వావసు వసుంధర చేరేవేళ
నవ వసంతరాగోదయం
కోయిల గొంతులో మాధుర్యమైంది
కాల కరాళ నృత్యంలో నలిగే
జీవితాలకాశ్వాసమై
విశ్వశాంతి శ్వాసకోశమై
జగతి ప్రగతికి బాటలు వేస్తూ
అరుగుదెంచే ఉగాదికిస్వాగతం

\- డా.ఎన్.వి.ఎన్.చారి, హనుమకొండ

విశ్వావసు వత్సరాది ఉగాదీ!



మోదుగ పూ వనములై
హరితారణ్యములే నిలవాలని
ఇంకుడుగుంతల ఊటలూరి
జలహారతులే పట్టాలని
చింతలేని భవితలతో
భరోసా గొడుగులు విప్పాలని
జాగృతపు పంచాంగం
శుభమస్తని వినిపించగా
షడ్రుచుల మేనాలో
టీవీగా ఇక రావమ్మా విశ్వావసు వత్సరమా!

\- రావుల కిరణ్మయి, హన్మకొండ

సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్



- కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

ఆత్మకూరు : సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్ అని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మజీద్‌లో ముస్లింలకు శనివారం ఇఫ్తార్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందు, ముస్లింలు సోదరభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్వతగిరి రాజు, బయ్య కుమారస్వామి, మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకల పంపిణీ



ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీరం మొనిక దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 75 మంది ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుక అందించారు. నిత్యావసర సరుకులు, సేమియా, చెక్కర, పాలు, బాదం, కాజు, కిస్‌మిస్, ఖర్జూరా అందించినట్లు తెలిపారు. అల్లా ఆశీస్సులతో ప్రజలందరు సుఖ, సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ


ధర్మసాగర్ : లీకైన ఏయిర్ వాల్వ్


శాయంపేట : లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ నీరు

శాయంపేట : మండల కేంద్రం నుంచి కొత్తగట్టు సింగారానికి వెళ్లే బైపాస్ రోడ్డు మలుపు వద్ద మురికి కాల్వలోకి మిషన్ భగీరథ మెయిన్ పైపులైను లీకేజీతో నీరు కలుషితమవుతోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల రోజుల నుంచి హేర్‌వాల్వ్ పక్కనున్న సైడ్ డ్రైనేజీలోకి మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ లీకేజీ అవుతుందని తెలిపారు. మిషన్ భగీరథ ఆపరేటర్లకు విన్నవించినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. నీరు పైకి వెదజల్లకుండా రాయిని అడ్డుపెట్టారని, సైడ్ డ్రైనేజీలో నీరు చేరి కలుషితమైన నీరు నల్లా ద్వారా వస్తుందని అన్నారు. దీంతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని వాపోయారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ధర్మసాగర్‌లో లీకైన ఏయిర్‌వాల్వ్..

ధర్మసాగర్ : మండలంలోని ఎల్కుర్తి పంపుహౌస్ నుంచి గండిరామారం వెళ్లే పైపులైన్ ఏయిర్ వాల్వ్ బంజర్‌పల్లి శివారులో శనివారం లీకై నీరంతా వృథాగా పోతుంది. ధర్మసాగర్ నుంచి గండి రామారం, స్టేషన్ ఘన్‌పూర్ వరకు రైతులు అక్కడక్కడ పైపులైన్ ఏయిర్‌వాల్వ్‌లు విప్పుతూ పొలాలకు నీరు పారిస్తుంటారు. ఈ క్రమంలో గురువారం సాయిపేట శివారులో పైపులైన్ లీకేజీ అవడంతో నీరు ఎగిసిపడుతుండడంతో అధికారులు పంపుహౌస్‌లో మోటార్లు బంద్ చేసి మరమ్మతులు చేపట్టి మోటార్లు ఆన్ చేశారు. దీంతో బంజర్‌పల్లి శివారులోని ఏయిర్‌వాల్వ్ ఎక్కువగా లీకేజీ అయ్యి నీరంతా వృథాగా పోతుంది.

పది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఐనవోలు : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు నందనం ఆకేరు వాగులో తనిఖీలు చేపట్టారు. రాత్రి 6 ట్రాక్టర్లను, ఉదయం 4 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

దామెర : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. మండలంలోని కోగిల్వాయిలో శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీంతో డ్రైవర్ పారిపోతుండగా అతనిని పట్టుకొని విచారించగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లికి చెందిన యార రవి ఇసుకను అక్రంగా తరలిస్తున్నట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉగాది పండుగను ఆనందంగా జరుపుకోవాలి


దామెర : ఏకశిల పాఠశాలలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు


శాయంపేట : ఉగాది పచ్చడి తాగుతూ భక్షాలు తింటున్న విద్యార్థులు

దామెర : ఉగాది పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఏకశిల ప్రైమ్ పాఠశాల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ రీతిలో వస్త్రాలు ధరించి, మామిడి ఆకుతో తోరణాలు కట్టి, షడ్రుచులతో పచ్చడి తయారుచేసి సేవించారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పండగ ప్రాశస్త్యం గురించి తెలిసే విధంగా ఉగాది పచ్చడి, భక్షాలు తయారు చేసి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు, గ్రామస్తులకు పంపిణీ చేశారు. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా విద్యార్థులు చిత్రాలతో రూపొందించిన కాల మానిని(క్యాలెండర్)ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, కుమారస్వామి, పెద్దకోడెపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సారయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి


జయలక్ష్మి (ఫైల్)

దామెర : ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఈ సంఘటన దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కనిపర్తికి చెందిన నేరెళ్ల జయలక్ష్మి (55) దామెర మండలంలోని పసరగొండకు బంధువుల ఇంటికి శుక్రవారం బయలుదేరింది. ఈ క్రమంలో హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారిపై పసరగొండ క్రాస్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో (టీఎస్ 03 యూసీ 670) నంబర్ గల ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి జయలక్ష్మిని ఢీ కొట్టింది. దీంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆమె మృతిచెందింది. మృతురాలి కుమారుడు నేరెళ్ల శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బియ్యం అందజేత

పరకాల : అనారోగ్యంతో మృతిచెందిన నిరుపేద మహిళ ఓంటేరు స్వరూప కుటుంబానికి బీఎస్పీ పట్టణ అధ్యక్షురాలు మడికొండ రవళి 50 కిలోల సన్నబియ్యం అందించారు. సీఎస్‌ఐ కాలనీవాసులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ధర్మసాగర్‌లో సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


ధర్మసాగర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

ధర్మసాగర్ : అవినీతికి తావులేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 88 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, 14 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. 365 రోజులు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేక చొరవతో దేవాదుల 3వ దశ పంపును ప్రారంభించు కున్నామన్నారు. ఏడాదిలో దేవాదుల పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు అంకితం చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పదవికి కలంకం తీసుకువచ్చిన వారు ప్రస్తుతం ప్రగల్భాలు పలుకుతున్నారని, పసలేని పనికిరాని విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 5 వేల కోట్లతో పూర్తి అయ్యే దేవాదులను నిర్లక్ష్యం చేసి లక్ష కోట్లతో కుంగిపోయిన కాళేశ్వరం కట్టారని విమర్శించారు. కడియం శ్రీహరికి దేవాదులతో సంబంధం లేదని, దేవాదులను ఎన్నడూ పట్టించుకోలేదని కొందరు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి


సీఐ రంజిత్‌రావు

శాయంపేట/ దామెర: ఏప్రిల్ 4వ తేదిన పరకాలలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు వినియోగించుకోవాలని శాయంపేట సీఐ రంజిత్‌రావు, దామెర ఎస్సై అశోక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గల నిరుద్యోగ యువత సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. స్కిల్స్(టెన్నికల్ లేదా నాన్ టెన్నికల్) ద్వారా ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. జాబ్ మేళా ఒక్కరోజే ఉంటుందని, యువతి, యువకులు అధిక సంఖ్యలో హాజరై ఉద్యోగ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు సూచించారు. మండలాల పరిధిలోని యువత తమ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


ఆగమ్మ (ఫైల్)

శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు లకిడే ఆగమ్మ (105) శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలు ఆగమ్మకు ఒక కుమారుడు, ఐదుగురు మనవళ్లు, మనువరాల్లు ఉండగా వారి సంతనాలను కలిపి కుటుంబం మొత్తం 46మంది ఉన్నారు. ఆగమ్మ చనిపోయే రోజు వరకు తన పని తాను చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆగమ్మ మృతితో గ్రామస్తులు సైతం తరలివచ్చి ఆమె భౌతికకాయానికి నివాళులిర్పించారు.

నేడు పంచాంగ శ్రవణం

నర్సంపేట : పట్టణంలోని భూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు (ఆదివారం) సాయంత్రం 5 గంటలకు శ్రీవిశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉగాది సందర్భంగా ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొనాలని కోరారు.

విద్యార్థి దశలోనే అధ్యయనం కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న సౌమ్య

నర్సంపేట : ఎరువుల తయారీ, ఇతర అంశాలపై విద్యార్థి దశలోనే అధ్యయనం చేయడం కీలకమని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య తెలిపారు. చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌లోని మోడల్ స్కూల్/జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన 'వన్ డే సైంటిస్ట్' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎరువుల తయారీ, కంపోస్టు ఎరువుల తయారీ, రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే లాభాలు, నష్టాలను విద్యార్థులకు వివరించారు. భూసార పరీక్ష పద్ధతులు, వానపాముల పెంపకం, వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని కూలంకషంగా అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్రవేత్త సౌమ్యను ప్రిన్సిపల్ జ్యోతి, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

అంగడి వేలంలో స్పష్టత కరువు..!

నెక్కొండ : స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడి (వారాంతపు సంత) వేలంలో స్పష్టత కరువైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల ఉదాసీనత, గుత్తేదారుల కుమ్మక్కుతో వాయిదాల పర్వం సాగుతోంది. నర్సంపేట డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ సమక్షంలో శనివారం వేలం నిర్వహించగా స్వల్పంగా పెరగడంతో దుబారా అయ్యాయని ఈఓ సదానందం ప్రకటించారు. నాల్గో సారి వేలంలో మేకల, గొర్రెలకు రూ.15.54 లక్షలకు, తైబజారుకు రూ.1.89 లక్షలకు గుత్తేదారులు పాట పాడారు. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన (అప్‌సెట్ ప్రైజ్) కంటే తక్కువకు వేలం ఉండడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు వాయిదా (దుబార) వేసినట్లు ఈఓ చెప్పారు. వరుసగా నాలుగు సార్లు వేలం నిర్వహించినా అప్‌సెట్ ప్రైజ్ రాకపోవడంతో ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఈఓ తెలిపారు.

కొప్పులలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న మధుసూదన్ దంపతులు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో గల శ్రీలక్ష్మి, భూలక్ష్మి సమేత బొడ్రాయిని ప్రతిష్ఠించి 41రోజులు పూర్తైన సందర్భంగా శనివారం బొడ్రాయి దాత సామల సౌమ్య మధుసూదన్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయికి జలాభిషేకం, హోమాన్ని మహాదేవ సాంబశివాలయ పూజారులు పానుగంటి కోటేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.